TGTEL/25/A0871

# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU



తెలంగాణ వెన్నెల వాక్కు విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక :361 | బుధవారం | 08-07- 2026 | పేజీలు: 4 | వెల రూ. 03


## పిల్లల భవిష్యత్తే తెలంగాణ భవిష్యత్తు:

హైదరాబాద్:
రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పిల్లలు ఆరోగ్యంగా, విద్యావంతులుగా ఎదిగితేనే ఆరోగ్యవంతమైన తెలంగాణతో పాటు బలమైన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నాచారం ఐడీఏ ప్రాంతంలో తెలంగాణ ఫుడ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన బాలామృతం ఉత్పత్తి కేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ఉత్పత్తి, ప్యాకింగ్ యూనిట్లను పరిశీలించి మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. గర్భిణుల నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లల వరకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తల్లి గర్భం దాల్చిన నాటి నుంచి శిశువు ఆరోగ్యవంతంగా పెరిగేలా అవసరమైన పోషకాహారాన్ని అందించేందుకు బాలామృతం కేంద్రాన్ని మరింత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన పిల్లలే రాష్ట్రానికి నిజమైన సంపద అని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడబోదని స్పష్టం చేశారు.

గతంలో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రారంభించిన ఈ సంస్థ ప్రస్తుతం 21 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాలకు కూడా పౌష్టికాహారం సరఫరా చేసే స్థాయికి ఎదిగిందని సీఎం తెలిపారు. ఈ సంస్థ సామర్థ్యాన్ని మరింత పెంచి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచేలా ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.



ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టామని సీఎం వివరించారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు లేకపోవడంతో పేద కుటుంబాలు కూడా తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనేవని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రభుత్వ బడుల్లోనే నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్యతో పాటు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. విద్యారంగంపై ప్రతి ఏడాది రూ.27 వేల కోట్లకు పైగా వ్యయం చేస్తున్నామని, దాన్ని ఖర్చుగా కాకుండా రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ మహిళా సాధికారతను దృష్టిలో పెట్టుకుని అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు రుణాలు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు, పెట్రోల్ బంకుల కేటాయింపు, అద్దె ప్రాతిపదికన ఆర్టీసీకి వెయ్యి బస్సుల ఏర్పాటు, ఇందిరా మహిళా శక్తి కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా క్యాంటీన్ల ఏర్పాటు వంటి పథకాలను వివరించారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

హైదరాబాద్‌లో భూముల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ నిరుపేదల కోసం లక్ష ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని సీఎం వెల్లడించారు. అలాగే 2034 నాటికి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఉపాధి, స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాలను విస్తృతంగా కల్పించే ప్రణాళికలను అమలు చేస్తున్నామని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, మహిళల సాధికారత, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం ఇచ్చే సంక్షేమ పాలన ద్వారానే తెలంగాణను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలబెడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## డిజిటల్ గవర్నెన్స్‌తో పారదర్శక పాలన

హైదరాబాద్:
రాష్ట్ర పరిపాలనలో పూర్తి స్థాయి పారదర్శకత తీసుకురావడంతో పాటు ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు డిజిటల్ గవర్నెన్స్ వ్యవస్థను సమగ్రంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అన్ని ప్రభుత్వ శాఖలను డిజిటలైజ్ చేయడంతో పాటు అవసరమైన చట్టాలు రూపొందించాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.



రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా వ్యవస్థను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు, జీతాలు, బ్యాంకు ఖాతాలు, సేవా రికార్డులు అన్నింటినీ ఒకే డిజిటల్ వేదికపై నమోదు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాల అమలులో కూడా సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించి అర్హులైన లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 4,800 కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా, వాటిలో దాదాపు 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధ ప్రయోజనాలు కల్పించడం లేదని, ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదలైనప్పటికీ ఉద్యోగులకు జీతాలు సకాలంలో చెల్లించడం లేదని ముఖ్యమంత్రి దృష్టికి

2

## భారత్-ఇండోనేషియా బంధానికి మోదీ నాంది

జకార్తా:
ఇండోనేషియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ పార్లమెంట్‌ను ఉద్దేశించి చేసిన ప్రసంగం భారత్--ఇండోనేషియా ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపునిచ్చింది. ఇండోనేషియా పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం లభించడం తనకు గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శతాబ్దాల చరిత్ర, ఉమ్మడి సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వం, ప్రజల మధ్య ఉన్న బలమైన అనుబంధమే రెండు దేశాల సంబంధాలకు బలమైన పునాదిగా నిలిచాయని ఆయన అన్నారు.



భారత్, ఇండోనేషియా కేవలం వ్యూహాత్మక భాగస్వాములు మాత్రమే కాకుండా వేల ఏళ్ల నాగరికతలను పంచుకున్న మిత్ర దేశాలని మోదీ తెలిపారు. రామాయణం, మహాభారతం వంటి భారతీయ ఇతిహాసాలు ఇండోనేషియా సంస్కృతిలో భాగమై ఉండటం రెండు దేశాల మధ్య ఉన్న సాంస్కృతిక బంధానికి నిదర్శనమని చెప్పారు. ఈ చారిత్రక అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రపంచం వేగంగా మారుతున్న నేపథ్యంలో శాంతి, స్థిరత్వం, సుస్థిర అభివృద్ధి కోసం భారత్, ఇండోనేషియా కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ప్రధాని అన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రత, స్వేచ్ఛాయుత వాణిజ్యం, ఉగ్రవాద నిర్మూలన, సైబర్ భద్రత, డిజిటల్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు, ఆరోగ్యం, విద్య, ఇంధనం, ఆహార భద్రత వంటి రంగాల్లో ఇరు దేశాలు మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెండు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను మరింత విస్తరించడంతో పాటు రక్షణ రంగంలో సహకారాన్ని పెంచాలని మోదీ పిలుపునిచ్చారు. యువత, విద్యార్థులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తల మధ్య పరస్పర సహకారం పెరగడం ద్వారా ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. పర్యాటక రంగంలోనూ విస్తృత అవకాశాలు ఉన్నాయని, ప్రజల మధ్య సంబంధాలు మరింత పెరిగితే రెండు దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. “భారత్, ఇండోనేషియా మధ్య ఉన్న స్నేహం గత చరిత్రతో మాత్రమే పరిమితం కాదు. భవిష్యత్‌లో కూడా స్నేహం, సహకారం, ఉమ్మడి శ్రేయస్సు దిశగా కలిసి ప్రయాణిస్తాం” అని ప్రధాని మోదీ తన ప్రసంగంలో స్పష్టం చేశారు. ఆయన ప్రసంగానికి ఇండోనేషియా పార్లమెంట్ సభ్యులు పలుమార్లు చప్పట్లతో అభినందనలు తెలిపారు.

ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు కీలక అంశాలపై చర్చలు జరిగాయి. వాణిజ్యం, రక్షణ, సముద్ర భద్రత, పెట్టుబడులు, సాంకేతిక సహకారం, ప్రాంతీయ భద్రత తదితర అంశాలపై అవగాహన మరింత బలపడిందని అధికారులు తెలిపారు. ఈ పర్యటనతో భారత్--ఇండోనేషియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త దిశ లభించిందని దౌత్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## రామాలయ ట్రస్ట్‌లో కీలక మార్పులు

అయోధ్య:
అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రామాలయ విరాళాల నిర్వహణ, పరిపాలన వ్యవహారాలపై ఇటీవల వెలుగులోకి వచ్చిన వివాదాల నేపథ్యంలో ట్రస్ట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామాలను ట్రస్ట్ అధికారికంగా ఆమోదించినట్లు ట్రస్ట్ ఖజాంచి గోవింద్ దేవ్ గిరి ప్రకటించారు. దీంతో వారిద్దరూ ఇకపై ట్రస్ట్ పదవుల్లోనే కాకుండా ట్రస్టీలుగానూ కొనసాగబోరని స్పష్టం చేశారు. అలాగే ప్రత్యేక ఆహ్వానిత




సభ్యుడు గోపాల్ నాగర్‌కట్టే (గోపాల్‌రావు)ను కూడా బాధ్యతల నుంచి తొలగిస్తూ ట్రస్ట్ నిర్ణయం తీసుకుంది. ఇటీవల రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాల నగదు లెక్కింపులో జరిగిన అక్రమాల ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతున్న తరుణంలో ట్రస్ట్ పరిపాలనలో మార్పులు చేపట్టాలని నిర్ణయించింది. భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసే ఘటనలు పునరావృతం కాకుండా

2

## స్థాయికి మించి నీటి నిల్వతోనే మేడిగడ్డకు నష్టం

హైదరాబాద్ బ్యూరో
తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రచారంలో ఉన్న కాళేశ్వరం నీటిపారుదల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ నిర్మాణంలో అత్యంత కీలకమైన మేడిగడ్డ ఆనకట్ట, కన్నెపల్లి తోటల దుస్థితికి మునుపటి ప్రభుత్వ నిర్లక్ష్యం, రాజకీయ ప్రచార ఆర్భాటాలే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. రక్షణ ప్రమాణాలను గాలికొదిలేసి, కేవలం గొప్పల కోసమే సామర్థ్యానికి మించి నీటిని నిల్వ చేయడం వల్లనే మేడిగడ్డకు ఈ గతి పట్టిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



ఈ నిర్మాణ నిర్వహణలో జరిగిన లోపాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరుసగా ఎండగట్టారు. పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజల సొమ్ము ఏ విధంగా బూడిదలో పోసిన పన్నీరైందో ఆయన వివరించారు. అందులో భాగంగానే రెండేళ్ల క్రితమే కన్నెపల్లి నీటితోట రక్షణ గోడ కూలిపోయిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆ ప్రమాదం కారణంగా భారీ మోటార్లు, అత్యంత విలువైన నీటిని ఎత్తిపోసే యంత్రాలు పూర్తిగా నీట మునిగిపోయాయని, అప్పుడే లోపాలు బయటపడినా మునుపటి ప్రభుత్వం కళ్లు తెరవలేదని విమర్శించారు. ఆ ఘటన జరిగిన ఏడాదికే మేడిగడ్డ ఆనకట్ట స్తంభాలు కుంగిపోయాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పునాదుల్లో లోపాలు, నాణ్యత లేని నిర్మాణం వల్లే ఇంతటి ఘోరం జరిగిందని సాంకేతిక నిపుణులు సైతం ప్రాథమికంగా తేల్చారని తెలిపారు.

ఆనకట్ట స్తంభాలు కుంగిపోవడానికి దారితీసిన పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రమైన ఆరోపణలు చేశారు. అక్కడ పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయడానికి వీలు లేదని నిపుణుల నివేదికలు స్పష్టం చేసినప్పటికీ మునుపటి ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందని మండిపడ్డారు. మేడిగడ్డ

2

# తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు.. శ్రమ దోపిడీకి నిలయాలు!

**- 152 ప్రభుత్వ కాలేజీల్లో 1,940 మంది అతిథి అధ్యాపకుల వెట్టిచాకిరి**

**- నాలుగు గంటల కూలీ చెల్లిస్తూ ఆరు గంటల పని**

**- అలిఖిత ఆదేశాలతో సీసీఈ కబంధహస్తాలు.. అమలుకాని ప్రభుత్వ హామీ**



నిర్మల్, జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు ప్రత్యేక కథనం):
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు తాత్కాలిక అతిథి అధ్యాపకుల (గెస్ట్ లెక్చరర్స్) పాలిట శ్రమ, కాల సమయ, ఆర్థిక దోపిడీకి నిలయాలుగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 152 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సుమారు 1,940 మంది అతిథి అధ్యాపకులను నియమించి, వారిచేత విద్యా సంవత్సరం అంతా నయా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభార్జన కోసం ఈ వ్యవస్థను డిగ్రీ కళాశాలల్లో ప్రవేశపెట్టారు. ఇది దేశంలోనే ఎక్కడా లేనటువంటి అత్యంత దారుణమైన ఆర్థిక దోపిడీ వ్యవస్థని, ఒక అధ్యాపకుడిని కేవలం రోజువారీ కూలీగా మార్చేందుకే విద్యాశాఖ దీనిని వాడుకుంటోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**యూజీసీ నిబంధనల ఉల్లంఘన.. అరకొర వేతనాలు:**
విశ్వవిద్యాలయ నిధుల సంఘం (యూజీసీ) నిబంధనల ప్రకారం నడుచుకుంటే డిగ్రీ అతిథి అధ్యాపకులు సామాజికంగా, ఆర్థికంగా గౌరవంగా బతకగలుగుతారని తెలిసి, ఆ నిబంధనలను ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టింది. కాలేజీల విద్యా కమిషనరేట్ (సీసీఈ) అడ్డదారి ఆదేశాలను ప్రిన్సిపాల్ ల ద్వారా క్షేత్రస్థాయిలో అమలు చేయిస్తున్నారు. నిజానికి ఒక పీరియడ్‌కు 700 రూపాయలు చెల్లించాలని నిబంధనలు చెబుతున్నా, ప్రభుత్వం కేవలం 390 రూపాయలు మాత్రమే ఇస్తోంది. రోజుకు నాలుగు గంటలు మాత్రమే బోధించాలని నిబంధన ఉన్నా, ఆరు గంటలు పని చేయించుకుంటున్నారు. ఒక నెలలో కేవలం 72 పీరియడ్లకు మాత్రమే బడ్జెట్ విడుదల చేస్తున్నారు. అంతకుమించి అదనంగా పాఠ్యాంశాలు బోధించినా ఒక్క పైసా కూలీ ఇవ్వడం లేదు.

**ఉచిత సేవలు.. అలిఖిత ఆదేశాలతో బెదిరింపులు:**
ప్రస్తుతం ఉన్న సెమిస్టర్ విధానం ప్రకారం ఒక విద్యా సంవత్సరంలో కేవలం 90 నుండి 108 రోజులకు మాత్రమే వీరికి వేతనం అందుతోంది. మిగిలిన రోజుల్లో డిగ్రీ ప్రవేశాల పనులు, ఆడిట్ రికార్డులు, న్యాక్ గుర్తింపు రికార్డులు, 99 రోజుల అభివృద్ధి ప్రణాళికల పేరిట ఎటువంటి కూలీ లేకుండా ఉచితంగా పని చేయించుకుంటున్నారు. దీనిని ఎవరైనా ప్రశ్నిస్తే సీసీఈ అలిఖిత ఆదేశాల ప్రకారం వారిని విధుల్లోంచి తీసేసి వేరొకరిని పెట్టుకుంటామని ప్రిన్సిపాల్ లు నేరుగా బెదిరింపులకు దిగుతున్నారు.

**అర్హతల్లో గందరగోళం.. పని గుర్తింపు శూన్యం:**
యూజీసీ నిబంధనల ప్రకారం డిగ్రీ కాలేజీల్లో అతిథి అధ్యాపకుడిగా పనిచేయాలంటే కేవలం స్నాతకోన్నత (పీజీ) ఉత్తీర్ణత ఉంటే సరిపోతుంది. కానీ సీసీఈ ఆదేశాల్లో స్పష్టత లేకపోవడం వల్ల ప్రిన్సిపాల్ లు నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలంటూ గందరగోళం సృష్టిస్తూ అధ్యాపకుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఏటా రిక్రూట్మెంట్ కమిటీలు వేసి డెమోల పేరిట పాతవారిని తొలగించి కొత్తవారిని తీసుకుంటున్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా కనీస పని ధ్రువీకరణ పత్రం (ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్) కూడా ఇవ్వకుండా ప్రభుత్వం శీతకన్ను వేసింది. ఒక తాత్కాలిక ఉద్యోగి స్థానంలో మరొక తాత్కాలిక ఉద్యోగిని నియమించరాదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినా విద్యాశాఖ పట్టించుకోవడం లేదు.

**అమలుకాని 50 వేల వేతన హామీ.. న్యాయస్థానమే దిక్కు:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో డిగ్రీ అతిథి అధ్యాపకులకు నెలకు 50,000 రూపాయల వేతనం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. అతిథి అధ్యాపకులకు కనీసం 12 నెలల నిరంతర సర్వీసు లేకపోవడం వల్ల నెలకు కనీసం 30,000 రూపాయలు కూడా సంపాదించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. ఈ అన్యాయమైన నిబంధనలతో కూడిన జీవోలను తక్షణమే రద్దు చేసి, అతిథి అధ్యాపకులను సంవత్సరమంతా కొనసాగించేలా ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) జోక్యం చేసుకోవాలని, లేనిపక్షంలో ఉన్నత విద్యా వ్యవస్థ కుప్పకూలి విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని విద్యావేత్తలు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# విద్యారంగ సంస్కరణలా? వ్యవస్థ విధ్వంసమా?

## రేవంత్ సర్కార్ ఆలోచించాల్సిందే!



తెలంగాణ విద్యావ్యవస్థ పునాదులను తీవ్రంగా కదిలించేలా, రాష్ట్రంలోని దాదాపు ఇరవై మూడు వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్న వార్త సమాజంలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది. బెంగళూరు వేదికగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించిన ఈ 'క్లస్టరింగ్' లేదా విలీన విధానంపై రాష్ట్రంలోని మేధావులు, జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్ వంటి హేమాహేమీలతో కూడిన పౌర సమాజం లేవనెత్తిన గళం పాలకుల కళ్లు తెరిపించాల్సిన సందర్భమిది. ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేస్తామంటూ, నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఏకంగా బడుల సంఖ్యను ఇరవై ఏడు వేల నుంచి నాలుగు వేలకు కుదించాలనుకోవడం సంస్కరణ అనిపించుకోదు. ఇది అనాలోచిత విద్యా సంహారంగా మారే ప్రమాదం ఉందని విద్యావేత్తలు గట్టిగా హెచ్చరిస్తున్నారు. ఒక ఊరికి బడి అనేది కేవలం అక్షరాలు నేర్పే నాలుగు గోడల కేంద్రం కాదు, అదొక సామాజిక చైతన్య వేదిక, గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే నిలువుటద్దం. మేధావుల బహిరంగ లేఖలో పేర్కొన్నట్లు, ఈ నిర్ణయం గనుక క్షేత్రస్థాయిలో అమలైతే దాదాపు పదిహేను వేల గ్రామాలు 'బడి లేని ఊళ్లుగా' మారిపోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని బాహాటంగా తుంగలో తొక్కడమే అవుతుంది.

ఇంటి ముంగిట బడి లేకపోతే, ఆర్థిక స్తోమత లేని బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పిల్లలు, ముఖ్యంగా ఆడపిల్లలు చదువును మధ్యలోనే ఆపేసే దుస్థితి దాపురిస్తుంది. కిలోమీటర్ల దూరం ప్రయాణించి పక్క ఊర్లకు వెళ్లి చదువుకునే సామాజిక వాతావరణం, భద్రత ఇంకా మన గ్రామాల్లో పూర్తిస్థాయిలో నెలకొనలేదు. దీనివల్ల డ్రాపౌట్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి, బాల్యమంతా చదువుకు దూరమై మళ్లీ పాత రోజుల్లో లాగా బాలకార్మిక వ్యవస్థ వైపు మళ్లే ప్రమాదం పొంచి ఉంది. గత పాలకుల హయాంలో మూతపడిన ఆరు వేల బడులను మెరుగైన సదుపాయాలతో తిరిగి తెరుస్తామని, విద్యపై పెట్టే ఖర్చు భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడి అని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి రాగానే ఇలాంటి తిరోగమన నిర్ణయానికి పూనుకోవడం ప్రజాస్వామ్య ద్రోహమే అవుతుంది. బడ్జెట్‌లో విద్యకు పదిహేను శాతం నిధులు ఇస్తామని వాగ్దానం చేసి, ఆచరణలో నిధుల కోత విధించడం పాలకుల ద్వంద్వ నీతిని స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణం పాలకుల నిర్లక్ష్యం, మౌలిక వసతుల లేమి, ఉపాధ్యాయుల కొరతే తప్ప, ప్రజలకు చదువుపై ఆసక్తి లేకపోవడం కాదు. ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అదుపు చేసేందుకు జీవో నెంబర్ వన్ ను పకడ్బందీగా అమలు చేయడంలో వైఫల్యాలు కూడా ప్రభుత్వ పాఠశాలల పతనానికి కారణమయ్యాయి.

అయితే, ఈ సంక్లిష్టమైన వ్యవహారాన్ని కేవలం రాజకీయ కోణంలోనే కాకుండా పాలకుల పరిపాలనా వ్యూహం వైపు నుంచి కూడా నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒకే ఒక్క విద్యార్థి లేదా ఐదుగురు విద్యార్థుల కోసం ఒక బడిని నడపడం, అక్కడ ఒకే ఉపాధ్యాయుడితో ఐదు తరగతుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం ఆచరణాత్మకంగా అసాధ్యమనే వాదనలోనూ కొంత హేతుబద్ధత ఉంది. పాఠశాలల్లో విద్యార్థులు లేకపోయినా కేవలం భవనాలను కాపాడుకుంటూ కూర్చోవడం వల్ల ఆశించిన విద్యా ప్రమాణాలు సాధించలేమన్నది పాలకుల ఆలోచన కావచ్చు. వనరులను విచ్ఛిన్నం చేయడం కంటే, ఒక క్లస్టర్ పరిధిలో అన్ని రకాల ఆధునిక సదుపాయాలు, ప్రతీ సబ్జెక్టుకు నిపుణులైన ఉపాధ్యాయులు, డిజిటల్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఆట స్థలాలు ఉన్న ఒక సమగ్రమైన మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేయడం ద్వారా పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించవచ్చనేది ప్రభుత్వ యోచన కావచ్చు. కానీ ఒకవేళ ప్రభుత్వం నిజంగానే విద్యా ప్రమాణాల మెరుగుదల కోసమే ఈ విలీన ప్రక్రియను చేపట్టదలిస్తే, ప్రతీ గ్రామం నుండి విద్యార్థులను సురక్షితంగా, ఉచితంగా స్కూలుకు చేర్చే బాధ్యతను ప్రభుత్వమే పూర్తిస్థాయిలో స్వీకరించాలి. అమెరికా, యూరప్ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో స్కూల్ బస్సుల ద్వారా విద్యార్థులను కేంద్రీకృత పాఠశాలలకు తరలించే పద్ధతి విజయవంతమైంది. కానీ మన దేశంలో, ముఖ్యంగా తెలంగాణ క్షేత్రస్థాయి మౌలిక వసతుల పరంగా అలాంటి పటిష్టమైన రవాణా ప్రణాళిక లేకుండా నేరుగా బడులను మూసివేస్తామనడం అత్యంత తొందరపాటు చర్య అవుతుంది.

రవాణా వ్యవస్థ సరిగ్గా లేని కారణంగా ఏ ఒక్క పేద బిడ్డ బడికి దూరమైనా, అది ఈ సంక్షేమ ప్రభుత్వానికి పెద్ద మచ్చగా మిగిలిపోతుంది. విద్య అనేది లాభనష్టాలను బేరీజు వేసే వ్యాపార రంగం కాదు, అది ఒక తరం భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యున్నత సామాజిక బాధ్యత. బడ్జెట్ భారాన్ని తగ్గించుకోవడమే పరమావధిగా చూస్తే, అది సంక్షేమ ప్రభుత్వ లక్షణం అనిపించుకోదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యా విధానాలను ప్రయోగశాలలుగా మార్చడం వల్ల నష్టపోయేది విద్యార్థులే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రతిపాదనలపై మొండిగా ముందడుగు వేయకుండా, వెంటనే మేధావులు, ఉపాధ్యాయ సంఘాలు, పౌర సమాజంతో విస్తృతస్థాయి చర్చలు జరపాలి. క్షేత్రస్థాయి వాస్తవాలను గౌరవిస్తూ, ఏ ఒక్క పేద బిడ్డ కూడా దూరం కారణం చేత బడికి దూరం కాకుండా చూస్తూనే, విద్యా ప్రమాణాలను పెంచే సమతుల్య విధానాన్ని అవలంబించడమే నేటి తెలంగాణకు అత్యంత ఆవశ్యకం.

విద్యా వ్యవస్థను కేవలం సంఖ్యల రూపంలో చూడకుండా, గుణాత్మక మార్పుల వైపు నడిపించడమే నిజమైన అభివృద్ధి. ప్రభుత్వ పాఠశాలల మనుగడ సాగితేనే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుంది. ప్రైవేటు శక్తుల చేతుల్లోకి విద్య పూర్తిగా వెళ్ళిపోతే సామాజిక అసమానతలు మరింత పెరుగుతాయి. కాబట్టి ప్రభుత్వం తన ముందస్తు వ్యూహాలను పునఃసమీక్షించుకుని, ప్రజామోదయోగ్యమైన రీతిలో సంస్కరణలను అమలు చేయాలి. ఒక ప్రజాస్వామ్య సమాజంలో ఏకపక్ష నిర్ణయాల వల్ల ఆందోళనలు తీవ్రతరమవుతాయే తప్ప సమస్యలు పరిష్కారం కావు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ మొండి పట్టుదలకు పోకుండా మేధావుల హెచ్చరికలను సానుకూలంగా స్వీకరించి, విద్యా రంగాన్ని కాపాడే చర్యలు చేపట్టాలని తెలంగాణ సమాజం ముక్తకంఠంతో కోరుతోంది.




**వెంకగారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**


# డిజిటల్ గవర్నెన్స్‌తో పారదర్శక పాలన

తీసుకువచ్చారు.
ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన ముఖ్యమంత్రి, ఉద్యోగుల హక్కులను కాలరాసే ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ అమలుతో జీతాల చెల్లింపుల్లో జాప్యం, అక్రమాలు, అవకతవకలకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు.
ప్రతి నెల 1వ తేదీ నుంచి గరిష్ఠంగా 5వ తేదీలోపు ఉద్యోగుల ఖాతాల్లో జీతాలు జమయ్యేలా సమర్థమైన డిజిటల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం చెల్లింపులు చేసినప్పటికీ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
అదేవిధంగా ప్రతి ఉద్యోగి సేవా వివరాలు, నియామక ప్రక్రియ, వేతన చెల్లింపులు, ఈఎస్ఐ, పీఎఫ్ చందాల వివరాలు అన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని సూచించారు. దీంతో ఉద్యోగుల సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ నిధుల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
ఈ వ్యవస్థ అమలుపై సమగ్ర అధ్యయనం చేసి 100 రోజుల్లో నివేదిక సమర్పించేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాల అమలును కూడా పూర్తిగా డిజిటలైజ్ చేయాలని, ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు.
డిజిటల్ గవర్నెన్స్ అమలుతో ప్రభుత్వ కార్యాలయాల్లో కాగితపు విధానానికి క్రమంగా స్వస్తి పలికి, అన్ని సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దీని ద్వారా ప్రజలకు సేవలు వేగంగా అందడంతో పాటు అవినీతి, జాప్యం, మధ్యవర్తుల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు.
ప్రభుత్వ పరిపాలనను పూర్తిగా సాంకేతిక ఆధారితంగా మార్చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు.
డిజిటల్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు చేరడంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కూడా మెరుగుపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.
ఈ సమావేశంలో ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వాణి ప్రసాద్, ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ వైస్ చైర్మన్ శాంతికుమారి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రామాలయ ట్రస్ట్‌లో కీలక మార్పులు

ఉండేందుకు పరిపాలనా వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చేందుకు చర్యలు ప్రారంభించింది.
ట్రస్ట్ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించిన అనంతరం తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే ట్రస్ట్‌కు పూర్తిస్థాయి ప్రధాన కార్యదర్శి, ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) నియామకానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ పరిపాలన, విరాళాల లెక్కింపు, ఆర్థిక నిర్వహణ, భద్రతా వ్యవస్థలను ఆధునీకరించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.
విరాళాల లెక్కింపు ప్రక్రియలో సాంకేతిక లోపాలు, భద్రతా బలహీనతలు బయటపడిన నేపథ్యంలో ఇకపై అత్యాధునిక సీసీటీవీ నిఘా, డిజిటల్ లెక్కింపు విధానం, నగదు నిర్వహణకు ప్రత్యేక ప్రమాణాలను అమలు చేయనున్నట్లు ట్రస్ట్ వర్గాలు వెల్లడించాయి. ఆలయానికి వచ్చే ప్రతి రూపాయి పారదర్శకంగా లెక్కించబడేలా, ఆడిట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా సిబ్బంది బాధ్యతలను కూడా పునర్వ్యవస్థీకరించనున్నారు.
విరాళాల దుర్వినియోగ కేసులో దర్యాప్తు సంస్థలు ఇప్పటికే పలువురిని విచారిస్తున్నాయి. నిందితుల నుంచి లభించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని మరికొందరి పాత్రపై కూడా విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో ఎవరైనా బాధ్యులని తేలితే వారి హోదా, స్థాయితో సంబంధం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ట్రస్ట్ స్పష్టం చేసింది. భక్తుల విశ్వాసాన్ని కాపాడటం తమ తొలి ప్రాధాన్యమని, ఆలయ పరిపాలనలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడమే లక్ష్యమని ట్రస్ట్ వెల్లడించింది.
దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన అయోధ్య రామాలయంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ట్రస్ట్‌లో చేపట్టిన తాజా మార్పులు ఆలయ పరిపాలనను మరింత బలోపేతం చేస్తాయని, భక్తుల నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు దోహదపడతాయని ట్రస్ట్ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## స్థాయికి మించి నీటి నిల్వతోనే మేడిగడ్డకు నష్టం

వద్ద అంతటి నీటిని ఆపే శక్తి లేదని తెలిసి కూడా, రాజకీయ ప్రచారం కోసం, తమ పనిని గొప్పగా చూపించుకోవడం కోసం ఏకంగా పదహారు వందల కోట్ల ఘనపుటడుగుల నీటిని నిల్వ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామర్థ్యానికి మించి నీటిని నిల్వ ఉంచడం వల్ల ఏర్పడిన అదనపు ఒత్తిడి వల్లే స్తంభాలు కుంగిపోయి, వ్యవస్థ అంతా దెబ్బతిన్నదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం ఇంతటి భారీ నీటి నిల్వలు చేయడం ముమ్మాటికీ నేరమేనని, ఇది తెలంగాణ ప్రజల ప్రయోజనాలతో ఆడుకోవడమేనని అన్నారు.
ఈ నిర్మాణ వ్యవహారాలు, దానికి అయిన ఖర్చు, దారి తీసిన లోపాలపై పూర్తి స్థాయి నిజాలు ప్రజల ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. కేవలం ప్రచార చిత్రాలతో వీటిని గొప్పగా చూపించడం కంటే, వాటి

# దుబాయ్‌లో మృతి చెందిన నరసింహులు కుటుంబానికి సత్యనారాయణ గౌడ్ ఆర్థిక సహాయం

సారంగాపూర్, జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు): సారంగాపూర్ మండలం వడ్డెర కాలనీకి చెందిన గల్ఫ్ కార్మికుడు శివరాత్రి నరసింహులు ఇటీవల దుబాయ్‌లో గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలను, కుటుంబ సభ్యులను నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి. సత్యనారాయణ గౌడ్ మంగళవారం పరామర్శించారు. నరసింహులు మృతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ పేదరికాన్ని దృష్టిలో పెట్టుకుని, తక్షణ సహాయం కింద 10,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని భార్య లక్ష్మికి అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, సాదు రామ్ రెడ్డి, సామల వీరయ్య, స్వర్ణ శ్రీనివాస్, చిన్నయ్య ఉన్నారు.



# మంతెన గ్రామంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

.ఆర్మూర్, జూలై 7(తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ మండలం మంతెన గ్రామానికి చెందిన నక్కల సాయమ్మ అనారోగ్యంతో ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందిన నేపథ్యంలో ఆమెకు మంజూరైన 1,75,000 రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మంగళవారం అందజేశారు. ఉజ్వల ట్రస్ట్ వ్యవస్థాపకుడు మినీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గ్రామంలో ఈ సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ చెక్కు లబ్ధిదారులకు మంజూరైందన్నారు. సకాలంలో వైద్య సహాయం అందించినందుకు బాధితులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వకీల్ గంగారెడ్డి, నక్కల సాయిరెడ్డి, విష్ణు గౌడ్, రాజేందర్ పాల్గొన్నారు.



# సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఐదు మొబైల్ ఫోన్లు రికవరీ.. బాధితులకు అందజేత

ఆర్మూర్, జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు పోగొట్టుకున్న ఐదు మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి మంగళవారం బాధితులకు అప్పగించారు. కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ పోర్టల్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆర్మూర్ పోలీసులు దర్యాప్తు జరిపి ఈ ఫోన్ల ఆచూకీ కనిపెట్టారు. రికవరీ చేసిన ఫోన్లలో రెండు సంవత్సరాల క్రితం పోయినవి 2 మొబైల్ ఫోన్లు, ఐదు నెలల లోపు పోగొట్టుకున్నవి 3 మొబైల్ ఫోన్లు ఉన్నాయని ఆర్మూర్ పట్టణ ఎస్హెచ్ఓ సత్యనారాయణ తెలిపారు. పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన సమావేశంలో బాధితులైన దేవి దాస్, భవాని, సత్యానంద్, చిన్న ముత్యాన్న, రమణయ్యలకు వారి ఫోన్లను తగిన పత్రాల పరిశీలన అనంతరం అప్పగించారు.



# శిశు మందిర్ విద్యాలయానికి 4 ఎకరాల భూమి విరాళం:

జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు): సిర్గాపూర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యాలయానికి నాలుగు ఎకరాల విలువైన భూమిని ఉదారంగా విరాళంగా అందించిన రాజ్యసభ సభ్యుడు నిరంజన్ రెడ్డికి, అలాగే వెంకట్ రమణా రెడ్డికి పలువురు ప్రముఖులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. భారతీయ సంస్కృతి, సనాతన విలువలు, దేశభక్తి, క్రమశిక్షణ వంటి ఉన్నత ఆదర్శాలతో భావితరాలను తీర్చిదిద్దే శిశు మందిర్ విద్యాసంస్థకు వారు అందించిన ఈ మహోన్నత భూదానం వేలాది మంది గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది కానుందని కొనియాడారు. విద్యాదానం సర్వదానాలలో శ్రేష్ఠమైనది అనే భారతీయ సంప్రదాయాన్ని ఆచరణలో చూపించిన దాతల సేవాభావం సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు.





# నిర్మల్ డిపోలో కార్గో వస్తువుల బహిరంగ వేలం

నిర్మల్, జూలై 8 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్మల్ డిపో కార్గో సర్వీసుల విభాగంలో బుక్ చేసి, చాలా కాలంగా లబ్ధిదారులు తీసుకెళ్లని పాత వస్తువులను ఈ నెల 9వ తేదీన నిర్మల్ డిపో ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ కే. పండరి



మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యాపారస్థులు, ప్రజలు జూలై 9వ తేదీ గురువారం ఉదయం 11:00 గంటలకు నిర్మల్ డిపోకు చేరుకుని ఈ బహిరంగ వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు.

# ఎంఈఓ సిద్ధ పద్మను మర్యాదపూర్వకంగా కలిసిన టీజీవీపీ నాయకులు

నిర్మల్, జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ మండల విద్యాశాఖ అధికారి సిద్ధ పద్మను మంగళవారం తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. విద్యాశాఖ కార్యాలయంలో ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న వివిధ విద్యా సమస్యలను, వసతుల కొరతను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మర్యాదపూర్వక సమావేశంలో టీజీవీపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్ కుమార్, నిర్మల్ నియోజకవర్గ కన్వీనర్ గణేష్, ఆత్మరామ్, అర్జున్ పాల్గొన్నారు.



# ముధోల్‌లో ప్రభుత్వ వైద్యశాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

**..ఏళ్లుగా నిలిచిపోయిన ఆస్పత్రి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

ముధోల్, జులై 7(తెలంగాణ వెన్నెల వాక్కు ):మండల కేంద్రమైన ముధోల్ లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాల పనులను తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బషీర్ అహ్మద్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముధోల్ నియోజకవర్గ కేంద్రంలో రూ. 8 కోట్ల వ్యయంతో 30 పడకల ప్రభుత్వ వైద్యశాల నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి టి. హరీష్ రావు శంకుస్థాపన చేశారని తెలిపారు. అయితే, పలువురు సంవత్సరాలు గడిచినా నిర్మాణ పనులు ఇంకా పూర్తికాకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.



ముధోల్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, సంబంధిత మంత్రులు, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిలిచిపోయిన నిర్మాణ పనులను పునఃప్రారంభించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని బషీర్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రభుత్వ వైద్యశాల అందుబాటులోకి వస్తే ముధోల్ మరియు పరిసర ప్రాంతాల వేలాది మంది ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని, చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన పేర్కొన్నారు.
ప్రభుత్వం ఈ ప్రజా ప్రయోజనకరమైన ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంతో పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అంకితం చేయాలని స్థానిక ప్రజలు కూడా కోరుతున్నారు.

# పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేస్తాం:

నిర్మల్, జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలను సమగ్రంగా వివరించారు. ఇప్పటికే బూత్ లెవెల్ అధికారుల (బిఎల్ఓ ల) ద్వారా ఎన్యుమరేషన్ ఫాం ల పంపిణీ పూర్తయిందని తెలిపారు. ఓటర్లు నింపిన వివరాలతో కూడిన ఎన్యుమరేషన్ ఫారం లు జూలై 24 తేదీ వరకు తిరిగి తీసుకుంటారు అని వివరించారు. ప్రస్తుతం ఎన్యుమరేషన్ ఫాం ల స్వీకరణ, డిజిటలీకరణ ప్రక్రియ కూడా కొనసాగుతుందన్నారు. గడువులోగా డిజిటలీకరణ పూర్తి చేస్తామన్నారు. అర్హులైన ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా, పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని అన్నారు. ప్రతి బుధవారం ఈఆర్వోల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సందర్భంగా లేవనెత్తిన అంశాలను కలెక్టర్ వివరించారు. ప్రజల్లో



మరింత అవగాహన కలిగేలా ఆటోల ద్వారా టామ్ టామ్ చేసి ప్రచారం కల్పిస్తామని తెలిపారు. హెల్ప్ డెస్క్ ల ద్వారా ఓటర్లకు సహాయం చేస్తున్నట్లు తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓలు దేవీదాస్, మోహన్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసిల్దార్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ముధోల్, జులై 7(తెలంగాణ వెన్నెల వాక్కు ):మండల కేంద్రమైన ముధోల్ లోని కొత్త బస్టాండ్ సమీపంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) 32వ ఆవిర్భావ దినోత్సవం, వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ చేపట్టిన సామాజిక ఉద్యమాలు, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. మాదిగల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గోరేఖ శంకర్, ఎంఎస్పీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అంబేకర్ సాయిచంద్ మాదిగ, నిర్మల్ జిల్లా అడక్ కమిటీ నాయకుడు గణపత్, నియోజకవర్గ ఎంఈఎఫ్ అధ్యక్షుడు గైక్వాడ్ నాగోబా, మాజీ సభ్యురాలు గైక్వాడ్ రాధాబాయి, ఎంఎస్ఎఫ్ నిర్మల్ జిల్లా అధికార ప్రతినిధి, రాష్ట్ర కన్వీనర్ గడేకర్ మహేశ్వర్ మాదిగ, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# వడ్తల గ్రామాల్లో ప్రజలకు మొక్కల పంపిణీ

ముధోల్, జులై 7(తెలంగాణ వెన్నెల వాక్కు ):ముధోల్ మండలంలోని వడ్తల గ్రామాల్లో మంగళవారం హోమ్ స్టెడ్ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ రమేష్ ఉచితంగా మొక్కలను పంపిణీ చేసి ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని ప్రజాప్రతినిధులు సూచించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, ప్రతి ఇంటిలో మొక్కలను పెంచే అలవాటు పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పంపిణీ చేసిన మొక్కలను సంరక్షించి వాటిని పెంచాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సురేష్,ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# నిర్మల్‌లో అధికారికంగా నూతన భరోసా కేంద్ర భవనం ప్రారంభం

**– బాధిత మహిళలు, చిన్నారులకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం: ఎస్పీ జానకి షర్మిల**
**– ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి**

నిర్మల్, జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
మహిళలు, చిన్నారుల రక్షణే ప్రధాన ధ్యేయంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో ఎల్లపెల్లిలో నిర్మించిన నూతన భరోసా కేంద్ర భవనాన్ని మంగళవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, నిర్మల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల హాజరై భవనాన్ని ప్రారంభించారు. దీనికన్నా ముందు భరోసా ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు, చిన్నారులకు భద్రత, రక్షణ, చట్టపరమైన సహాయం, మానసిక పరామర్శ, పునరావాస సేవలను ఒకే వేదికపై అందించేందుకు భరోసా సెంటర్ కీలక పాత్ర పోషించనుందన్నారు. బాధితులకు సత్వర, సమగ్ర సేవలు అందుబాటులోకి రావడంతో పాటు వారి పట్ల మరింత సమర్థవంతమైన సహాయ వ్యవస్థ బలోపేతం కానుందన్నారు. న్యాయ ప్రక్రియ పూర్తయ్యే వరకు అవసరమైన సహాయం అందించేందుకు శిక్షణ పొందిన కౌన్సెలర్లు, న్యాయ నిపుణులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. భవన నిర్మాణానికి సహకరించిన ఎన్‌టీటీ డేటా బిజినెస్ సొల్యూషన్స్ సంస్థ మేనేజింగ్



డైరెక్టర్ క్రునాల్ పటేల్ కు ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సంస్థ ప్రతినిధులు తిరుమల రెడ్డి, ఖుష్ గుప్తా, అనిల్, సాయి కిరణ్, శివచరణ్ రెడ్డి, న్యాయాధికారులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్ దొంగల ముఠా అరెస్ట్.. 74 కిలోల రాగి తీగలు స్వాధీనం

**– ఆర్మూర్ పరిధిలో ఏడుగురు నిందితుల అరెస్ట్: పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య వెల్లడి**
**– వేల్పూర్, బాల్కొండ, భీంగల్ పరిధిలో 19 చోరీ కేసుల్లో భాగస్వామ్యం**

ఆర్మూర్, జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి కాయిల్స్‌ను దొంగిలిస్తూ పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఏడుగురు నిందితుల ముఠాను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 74



కిలోల రాగి తీగలు, ఒక ట్రాలీ ఆటో, మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్ ఫోన్లు, దొంగతనాలకు ఉపయోగించిన పనిముట్లు స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, ఆర్మూర్ కు చెందిన కర్రే వినోద్ కుమార్, ఆంద్రాసి నవీన్, గుంబోల్ల ఈశ్వర్, బాజ హరిప్రసాద్, కర్రే విజయ్ కుమార్, మూల దుర్గాప్రసాద్ రెడ్డి కలిసి ఒక ముఠాగా ఏర్పడి, పగటి సమయంలో స్క్రాప్ కొనుగోలు చేస్తున్న నెపంతో గ్రామాల శివార్లలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించేవారు. రాత్రి వేళల్లో రాగి కాయిల్స్‌ను దొంగిలించి, ఆర్మూర్ కు చెందిన స్క్రాప్ వ్యాపారి అబ్దుల్ వసీం అలియాస్ తిల్లి బాబాకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులు వేల్పూర్, బాల్కొండ, మెండోర, భీంగల్, ఆర్మూర్, యెర్గట్ల పరిధిలో మొత్తం 19 చోరీ కేసుల్లో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం ఉదయం పడగల్ గ్రామ శివారులోని రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆరుగురు నిందితులను, అనంతరం స్క్రాప్ వ్యాపారి అబ్దుల్ వసీంను అరెస్ట్ చేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ శుభం నగరాలే, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, రూరల్ సీఐ జాన్ రెడ్డి, వేల్పూరు ఎస్ఐ సాయి కిరణ్, బాల్కొండ ఎస్ఐ శైలేర్ పాల్గొన్నారు.

# మారుమూల ప్రాంతాల ప్రజలకు 24 గంటల వైద్యసేవలు అందించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**.– పెంబి మండలంలో ఆరోగ్య కేంద్రం, కేజీబీవీ, పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు**

పెంబి, జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటల పాటు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం పెంబి మండలంలో ఆకస్మికంగా పర్యటించిన ఆయన ఆరోగ్య కేంద్రం, పాఠశాల, కేజీబీవీ, గ్రామపంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఓపీ విభాగం, మందుల నిల్వ గదిని పరిశీలించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో



ఉంచాలని, వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు, పాముకాటు కేసులు పెరిగే అవకాశమున్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి వన మహోత్సవంలో భాగంగా మొక్క నాటారు. పదివ తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ చదువులో ప్రతిభ కనబర్చాలన్నారు. మందపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించి, ఫారాల ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలన్నారు. కేజీబీవీలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పర్యటనలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంఈఓ రామ్‌చందర్, ఎఫ్ఆర్ఓ కల్పనాదేవి పాల్గొన్నారు.

# జూలై 10న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి

భైంసా, జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగంలో రోజురోజుకూ పేరుకుపోతున్న ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తోందని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. మంగళవారం భైంసా ప్రభుత్వ జూనియర్ ప్రైవేట్ కళాశాల ప్రాంగణంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఏఐపీఎస్‌యూ ఆధ్వర్యంలో జూలై 10 రాష్ట్రవ్యాప్త బంద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం సుమారు 9,000




కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీఇంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేయడం వల్ల నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలలో ఫీజుల దోపిడీని అరికట్టడానికి ఫీజు నియంత్రణ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. విద్యాసంస్థల బంద్‌కు భైంసా డివిజన్ పరిధిలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యార్థి సంఘాల ముఖ్య నాయకులు పరమేష్, దిగంబర్, మహేందర్, కిరణ్, వెంకటేష్, కైలాష్, వినయ్, సంతోష్ పాల్గొన్నారు.

# దిలావర్‌పూర్ ఉన్నత పాఠశాలలో వైభవంగా ఒడిస్సీ నృత్య ప్రదర్శన

దిలావర్‌పూర్, జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఒడిస్సీ నృత్య ప్రదర్శన అత్యంత ఆకర్షణీయంగా నిర్వహించారు. ఢిల్లీ ఐఐటీ పూర్వ ఆచార్యుడు పద్మశ్రీ డాక్టర్ కిరణ్ సేన్ స్థాపించిన 'సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్' అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దేశమంతా భారతీయ నృత్యాలను పరిచయం చేయడంలో భాగంగా ఈ ప్రదర్శన చేశారు. ఈ నృత్య ప్రదర్శనలో ప్రముఖ ఒడిస్సీ కళాకారిణి ఆశాకుమారి తన నృత్య ప్రదర్శనతో విద్యార్థులను అలరించారు. భరతనాట్యం, కథకళి, ఓనం నృత్యాలలో ఉండే భంగిమల గురించి వివరించారు. ఒడిస్సీ నృత్యంలో ఉండే వివిధ ముద్రలను విద్యార్థులకు వివరిస్తూ, ఆసక్తి గల కొంతమంది విద్యార్థులతో నృత్యాన్ని అభ్యసనం చేయించారు. వివిధ సాంప్రదాయ నృత్యాలను గూర్చి తెలుసుకోవడం తమ పాఠశాల విద్యార్థుల అదృష్టమని దిలావర్‌పూర్ మండల విద్యాధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. సదానందం అన్నారు.



# జూలై 10న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి: ప్రజాసంఘాల పిలుపు

నిర్మల్, జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 10న దేశవ్యాప్తంగా చేపట్టబోయే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం నిర్మల్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలుగా ఉన్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మిక వర్గాన్ని దెబ్బతీసిందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని మారుస్తూ నిరుపేద కూలీలకు నష్టం చేకూరుస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ లో రైతులకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి నర్సయ్య, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు, డాకుర్ తిరుపతి, బరుకుంట గంగారం, నాగుల నర్సాగౌడ్ పాల్గొన్నారు.



# నిర్మల్ డిపో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: ఎస్డబ్ల్యూఎఫ్ వినతి

నిర్మల్, జూలై 7 (తెలంగాణ వెన్నెల వాక్కు):
టీజీఎస్ఆర్టీసీ నిర్మల్ డిపో ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం నిర్మల్ డిపో మేనేజర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, ఎస్డబ్ల్యూఎఫ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, నిర్మల్ డిపో కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ, ఎక్స్‌ప్రెస్ చార్టులో నాలుగు ఓటీ డ్యూటీలను మార్చాలని, డ్యూటీ చార్టు కౌన్సిలింగ్ నిర్వహించి అమలు పరచాలన్నారు. కౌన్సిలింగ్ సమయంలో అన్ని యూనియన్లకు పాల్గొనే అవకాశం కల్పించాలన్నారు. అంతర రాష్ట్ర సర్వీసుల్లో ప్రయాణించే మహిళలకు ఓ మరియు ఫేర్ ఒకే టికెట్‌లో వచ్చే విధంగా టిమ్ మెషీన్లను సవరించాలన్నారు. సర్వీసు చేస్తున్నప్పుడు టిమ్ పైన కుడి పక్కన ఉన్న ఎరో మార్కును తొలగించాలన్నారు. వచ్చే నెల ఆగస్టులో రిటైర్మెంట్ స్థానంలో సీనియారిటీ ప్రకారం కౌన్సిలింగ్ లో వరుస క్రమంలో భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు బి. లింగన్న, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాజేశ్వర్, తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.



OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com